ప్రజాశక్తి
శనివారం 19 ఆగస్టు 2023



గుమ్మ సర్పంచ్ ఉపఎన్నికకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మ సర్పంచ్ ఎన్నిక నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎంపిడిఒ వివి శివరామప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల19 నిర్వహించే ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా మండల ఇంజనీరింగ్ అధికారి ఎన్.నాగేశ్వరరావు, తొమ్మిది మంది సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. గుమ్మ పంచాయతీలో 1202ఓట్లు ఉండగా మహిళా ఓటర్లు 629, పురుషులు 573 మంది ఉన్నారని, వీరంతా ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సత్య బయోఫ్యూయల్స్‌కు
భూమి కేటాయింపుపై చర్చ

- కారుచౌకగా కట్టబెడతారా? అంటూ ప్రశ్నలు
- ఇది అధికార దుర్వినియోగమేనంటూ విమర్శలు
- మంత్రి బొత్స ఎలా సమర్థించుకుంటారో..?
- భూముల దోపిడీపై ముందే పసిగట్టిన 'ప్రజాశక్తి'


పరిశ్రమలు ఎక్కడ ? భూములు ఎవరికి ?

భూముల కేటాయింపులపై సమావేశాల గురించి జులై 30న ప్రజాశక్తిలో వచ్చిన కథనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

బొబ్బిలిలోని ఎపిఐఐసి గ్రోత్ సెంటర్లో మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబానికి చెందిన సత్య బయోఫ్యూయల్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి 30 ఎకరాల భూమిని కారుచౌకగా కట్టబెట్టడం జిల్లాలో చర్చనీయాశంగా మారింది. టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున స్పందిస్తూ శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభుత్వ జిఒను రద్దుచేయాలంటూ ప్రకటనలో డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే వాస్తవిక ధరలకు భూములు కేటాయించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికార యంత్రాంగం దాటవేత ధోరణి ఆధారంగా భూముల కేటాయింపులో మతలబు జరుగుతున్నట్టు ప్రజాశక్తి ముందే గుర్తించింది. జనం కూడా అనుమానించారు. ఈనేపథ్యంలో 'పరిశ్రమలు ఎక్కడ? భూములు ఎవరికి' అన్న పబ్లిక్‌టాక్ ప్రచురించిన సంగతి తెలిసిందే. సరిగ్గా 20 రోజుల వ్యవధిలో అడ్డగోలుగా భూములు కేటాయించినట్టు వెలుగులోకి వచ్చింది. బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో ఎపిఐఐసి లెక్కల ప్రకారం ఎకరం ధర రూ.81.93 లక్షల వరకు ఉంది. ఇటువంటి భూమిని ఎకరా రూ.10 లక్షల చొప్పున బొత్స సోదరులు సతీష్ కుమార్, ఆదినారాయణ డైరెక్టర్లుగా ఉన్న కంపెనీకి ప్రభుత్వం కేటాయించిదని టిడిపి, సిపిఎం నాయకులు విమర్శించారు. బొబ్బిలి గ్రోత్ సెంటరుకు చుట్టుపక్కల బహిరంగ మార్కెట్లో ఎకరం భూమి ధర రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఉంది. దీన్ని బట్టి సుమారు రూ.22 కోట్ల మేర బొత్స కుటుంబానికి అనుచిత లబ్ధిచేర్చారని జనం చర్చించుకుంటున్నారు. ఈ భూమిలో డిస్టిలరీ, ఇథైల్ ఎసిటేట్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారట. మద్యం ఉత్పత్తిలోనూ, ఫార్మా తదితర పరిశ్రమల్లోనూ ఉపయోగించే ఇథనాల్ ఇక్కడ తయారు చేస్తారని సమాచారం. ఈ భూముల కేటాయింపునకు సంబంధించి ఆగమేఘాలపై ఫైలు నడిచింది. వాస్తవానికి జిల్లా పారిశ్రామికంగా వెనుకబడి ఉంది. ఈనేపథ్యంలో పరిశ్రమలు, పెట్టుబడులను ప్రోత్సహించడంలో తప్పులేదు. కానీ, అత్యంత కారుచౌకగా అదీ మంత్రి కుటుంబీకుల పేరున ఏర్పాటు చేయబోయే పరిశ్రమకు ధారాదత్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో, మంత్రి తన అధికారాన్ని అడ్డం పెట్టుకున్నారని కొందరు, ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రజల ఆస్తులను వివిధ రూపాల్లో ధారాదత్తం చేస్తున్నారని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. అందువల్లే ఇటీవల జరిగిన పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక సమావేశంలో పరిశ్రమలకు భూముల కేటాయింపు మినహా, వాటిని ఎవరు? ఎక్కడ ఏర్పాటు చేస్తారు? ఎంతెంత? భూమి కేటాయిస్తారనేది స్పష్టం చేయలేదు. ఈనేపథ్యంలో జనంలో సాగిన చర్చను ప్రజాశక్తి ప్రతిబింబించింది. నేడు అదే నిజమని తేలింది. ఇంకా ఎక్కడెక్కడ ఎంతమందికి కేటాయించారో? అంటూ పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

26న మాజీ ఎమ్‌పి గీత కులవివాదంపై విచారణ

ప్రజాశక్తి - సాలూరు

అరుకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత కులవివాదంపై ఈనెల 26న విచారణ చేపట్టనున్నారు. ఈ మేరకు ఆమెకు గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయం తరపున పత్రికా ముఖంగా నోటీసు జారీ చేశారు. గత కొంతకాలంగా గీత చిరునామాకు విచారణకు హాజరు కావాలని కోరుతూ నోటీసులు పంపుతున్నా తీసుకోవడం లేదని ఆ కార్యాలయం నోటీసులో పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం న్యాయ సలహాదారు రేగు మహేష్, గిరిజన సంఘం నాయకులు ఈ.ఆంజనేయులు మాజీ ఎంపీ గీత కులవివాదంపై కేసు వేశారు. రాష్ట్ర స్థాయి కమిటీకి వారు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేస్తున్నారు. మాజీ ఎంపి గీత గిరిజన ధ్రువీకరణ పత్రంతో గతంలో వైసిపి తరపున అరుకు పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత ఆమె ఎస్టీ కాదని గిరిజన సంఘాలు ఆమెపై ఫిర్యాదు చేశాయి. విచారణకు రావాలని కోరుతూ నోటీసులు పంపుతున్నా తీసుకోవడం లేదన్న కారణంతో ఆమెకు పత్రికా ముఖంగా నోటీసు జారీ చేశారు.

ఎంప్లాయిస్ గ్రీవెన్స్‌కు 39 దరఖాస్తులు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఎంప్లాయిస్ గ్రీవెన్స్ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్, డిఆర్ఒ జె.వెంకటరావు ఉద్యోగుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఉద్యోగుల గ్రీవెన్స్‌లో 39 అర్జీలు అందాయి. ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగుల స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఒ పి.వీర్రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ అధికారి ఓ.ప్రభాకర రావు, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న వంతెన సాధన కమిటీ సభ్యులు, గిరిజనులు

వంతెన అవసరం తప్పనిసరి

అర్ధ నగ్నంగా మోకాళ్లపై నిల్చొని రెండో రోజు దీక్ష

ప్రజాశక్తి - కొమరాడ

దీర్ఘకాలంగా గిరిజనులు ఎదురుచూస్తున్న పూర్ణపాడు-లాబేసు వంతెన అవసరం ఎంతైనా ఉందని, కావున వెంటనే పనులు పూర్తి చేయాలని వంతెన సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తిచేసి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని కోరుతూ సాధన కమిటీ ఆధ్వర్యంలో కోమట్లపేట వద్ద రెండో రోజు శుక్రవారం అర్ధనగ్నంగా మోకాళ్లపై నిల్చొని, భారీ వర్షం మధ్య గొడుగులు వేసుకొని దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జనసేన మండల నాయకులు శ్రీకర్ దీక్షలకు మద్దతు తెలిపారు. అనంతరం సాధన కమిటీ సభ్యులు వాకాడ ఇందిర, కొల్లి సాంబమూర్తి, బత్తిలి శ్రీనివాసరావు, పాలక నూకరాజు మాట్లాడుతూ పాలకులు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికైనా వెంటనే వంతెన పనులు పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వంతెన పనులు పూర్తి చేయాలని కోరుతూ గతంలో అనేక సందర్భాల్లో సిపిఎం ఆధ్వర్యంలో అనేక రూపాల్లో ఆందోళనలు చేశామన్నారు. జనవరిలో పనులు ప్రారంభించిన వెంటనే కాంట్రాక్టర్‌కు నిధులు చెల్లించకపోవడంతో ఆయన వెళ్లిపోవడం అన్యాయమన్నారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయించి, వంతెన పెండింగ్ పనులు పూర్తిచేసి 60 గిరిజన గ్రామాల ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలకు స్పందించకపోతే ఈనెల 28న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామన్నారు. రిలే నిరాహార దీక్షల్లో, ధర్నాలో ప్రజలంతా పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు శివున్నాయుడు, వెంకటేశు, అప్పారావు, పోలినాయుడు, గౌరి, గణపతి, సింహాచలం, అప్పారావు, రాయుడు, సరోజినమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ముమ్మరంగా ఓటరు పునశ్చరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ముమ్మరంగా ఓటరు పునశ్చరణ కార్యక్రమం చేస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి శుక్ర వారం జిల్లా కలెక్టర్లతో ఓటరు పునశ్చరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటి ఓటరు విచారణ చక్కగా సాగుతుందన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్తున్నారని, అన్ని అంశాలు నిర్దేశిత సమయం నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. జిల్లాలో 7,70,144 మంది ఓటర్లు ఉన్నారని, 8,255 మంది నమోదు కాని ఓటర్లను గుర్తించామని, 1457 డుప్లికేట్ ఓట్లు, 1529 మార్పు చెందిన (బదిలీ ఓటర్లు), 4288 మంది మృతి చెందిన ఓటర్లను గుర్తించామని వివరించారు. ఓటరు జాబితాలో అవసరం లేదని గుర్తించిన 8009 ఓట్లు గుర్తించామని, వీటిపై ఇప్పటికే 7910 దరఖాస్తులు తీసుకున్నామని, 10 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న గృహాలు 3727, వాటిలో 64,550 ఓట్లు ఉన్నట్లు గుర్తించి వాటిని పరిశీలించామని తెలిపారు. 34,607 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. వందేళ్లు దాటిన 71 మంది ఓటర్లను గుర్తించి విచారించామన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిష్కరించే దిశగా దృష్టి సారించామని, ఆగస్టు 30 నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని ఆయన చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ జె.వెంకటరావు పాల్గొన్నారు.

పంచాయతీల్లో డ్రై డే, ఫ్రైడే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, కేదారిపురం పంచాయతీల్లో డ్రై డే, ఫ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ గ్రామాల్లో ఉన్న అన్ని వాటర్ ట్యాంకులు, బావుల్లో క్లోరినేషన్ చేయించారు. ఈగలు దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలని, కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొత్త కమిషనర్ నియామకం ఎప్పుడో?

- ఎసిబి వలలో చిక్కిన కమిషనర్‌పై వేటు
- ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇవ్వని ఉన్నతాధికారులు
- పదిరోజులుగా స్తంభించిన కార్యకలాపాలు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు అవినీతి నిరోధక శాఖ వలలో చిక్కి పదిరోజులయింది. కానీ ఇంతవరకు కొత్త కమిషనర్ నియామకం జరగలేదు. ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఎవరికి బాధ్యతలు అప్పగించలేదు. సాధారణంగా ఇలాంటి పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే ఒకటి, రెండు రోజుల్లో స్థానికంగా ఉన్న ఏ అధికారికో ఇన్‌ఛార్జి బాధ్యత అప్పగించడమో, కొత్త కమిషనర్‌ను నియమించడమో జరుగుతుంది. కమిషనర్ శంకరరావు ఎసిబి వలలో చిక్కి పదిరోజులైంది. ఆయన అరెస్టై జైలుకెళ్ళారు. అంటే ఆయన సస్పెండ్ అయినట్లే. పదిరోజులుగా మున్సిపాలిటీకి కమిషనర్ లేకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటిపన్ను మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో ఆ దరఖాస్తులు క్లియర్ అవ్వాలంటే రెగ్యులర్ కమిషనర్ గానీ, పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌ఛార్జి కమిషనర్ గానీ ఉండాలి. ఆ పరిస్థితి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

డిప్యూటీ సిఎం ఇలాకాలో

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం రాజన్నదొర ఇలాకాలో పదిరోజులుగా కమిషనర్ లేని పరిస్థితి ఏర్పడింది. పాత కమిషనర్ శంకరరావు ఎసిబి వలలో చిక్కి పదిరోజులైనా కొత్త కమిషనర్ నియామకంపై డిప్యూటీ సీఎం రాజన్నదొర దృష్టి సారించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే కొంతమంది ఆశావహులైన మున్సిపల్ అధికారులు ఇక్కడికి కమిషనర్‌గా రావడానికి ఆసక్తి చూపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.



గతంలో ఇక్కడ మేనేజర్‌గా పనిచేసి ఇన్‌ఛార్జి కమిషనర్ బాధ్యతలు చేపట్టిన టి.జయరాంను తీసుకురావాలనే ప్రయత్నంలో వున్నట్టు తెలుస్తోంది. ఏది జరిగినా పట్టణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తొందరగా కమిషనర్ నియామకం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కమర్

ఆక్రమణలపై సబ్ కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రాంగణం ఆక్రమణకు గురైందని ఆ గ్రామస్తులు కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం పాలకొండ సబ్ కలెక్టర్ గ్రామానికి చేరుకొని పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. గతంలో ఎస్సీ కాలనీకి సమీపానున్న స్థలాన్ని, జగనన్న లేఅవుట్ దగ్గర కూడా స్థలాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉన్న ఈ ఇళ్లను తొలగించి వేరే చోటికి నిర్మాణాలు చేపడితే పాఠశాల అభివృద్ధి చెందుతుందని గ్రామస్తులు సబ్‌కలెక్టరు దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. చక్కగా చదివి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. ఆయనతో పాటు సర్పంచు అలజంగి విజయమ్మ, పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, పరిశినాయుడు, ఎస్.చిన్నంనాయుడు, వి.కృష్ణమోహన్, తహశీల్దారు సిహెచ్ సత్యనారాయణ, ఎంఇఒ గౌరునాయుడు, ప్రధానోపాధ్యాయులు డి.నాగమణి, ఆర్ఐ ఎస్.మారుతీరావు, విఆర్ఒ రెయ్యన్న, సచివాలయ కార్యదర్శి బంగారు బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బొబ్బిలి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జరుగుతుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అధ్యక్షతన జరిగే సమావేశంలో జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

20న ఎపి స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్ష ఈనెల 20న నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి ఎండీ గయాజుద్దీన్ తెలిపారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్-1, 2 సర్వీసులకు కోచింగ్‌కు అభ్యర్థుల ఎంపిక కోసం ప్రవేశ నిర్వహిస్తున్నట్లు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో ఉన్న ఎపి స్టడీ సర్కిల్ బ్రాంచ్‌ల్లో త్వరలో ప్రారంభం కానున్న సివిల్ సర్వీసెస్, గ్రూప్-1,2లకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ప్రోగ్రామ్ కోసం రాష్ట్రంలో సుమారు 11,008 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని ఆయన చెప్పారు. ఎంపిక కోసం ప్రవేశ పరీక్ష ఈనెల 20న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అభ్యర్థులు తమ దరఖాస్తులో ఎంచుకున్న కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులకు వ్యక్తిగతంగా గత 10 రోజుల్లో మూడుసార్లు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించడం జరిగిందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా తమ హాల్ టిక్కెట్లను apstdc.apcfss.in పోర్టల్ నుండి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావాలని అభ్యర్థించారు. పరీక్ష ఫిజికల్ మోడ్‌లో ఉంటుందని, ఒఎంఆర్ షీట్‌లో సమాధానం ఇవ్వాలని ఆయన అన్నారు. పేపర్ మల్టిపుల్ చాయిస్ మోడ్‌లో ఉంటుందని స్పష్టం చేశారు.




పార్వతీపురం, పాలకొండలో మానవహారం నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్రంలో మున్సిపాల్టీల్లోనూ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని కోరుతూ స్థానిక పాతబస్టాండ్ వద్ద మున్సిపల్ కార్మికులు శుక్రవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చనిపోయిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికులను పెంచాలని, పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు 11వ పిఆర్‌సిని అమలు చేయాలని, డిఎ చెల్లించాలని, సరెండర్ లీవ్ అమలు చేయాలని, రెండు నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఇంజనీరింగ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు హెల్త్ అలవెన్సులు వర్తింపచేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. పాలకవర్గాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యాన్ని విడనాడి కార్మిక సమస్యలు పరిష్కరించే దిశగా నిర్ణయం చేయకుంటే, భవిష్యత్తులో జరిగే ఆందోళనకు పాలకవర్గాలు, రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, శివ, రాజేష్, సత్తిరాజు, తిప్పలమ్మ, సుజాత, గబ్బర్ సింగ్, పర్మినెంట్ ఉద్యోగుల నాయకులు ఎం.శ్రీను, ఎన్.శివ, జి.గంగరాజు, హరి, ఆనంద్, మజ్జి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు మానవహారం


పాలకొండ: పట్టణంలో మున్సిపల్ కార్మికులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పాలకొండ కమిటీ కార్యదర్శి సిహెచ్.సంజీవి, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు వై.హరిబాబు మాట్లాడుతూ సమాన పనికి సమాన జీతం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, చనిపోయిన కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, పెరుగుతున్న జనాభాకు తగినంత మంది కార్మికులను పెంచాలని, పాలకవర్గాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యాన్ని వెడనాడి కార్మిక సమస్యలు పరిష్కారం చేసే దిశగా నిర్ణయం చేయకుంటే, భవిష్యత్తులో జరిగే ఆందోళనకు పాలకవర్గాలు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో చింతల సురేష్, పడాల వేణు, వి. అంజి, జి. సాంబమూర్తి, శ్రీదేవి, విమల తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ అధ్యక్షులు నిశాంత్ కుమార్ అన్నారు. మారుమూల గ్రామాల్లో వైద్య సేవల ఆవశ్యకత ఉందని, ప్రణాళికా బద్ధంగా షెడ్యూలు తయారు చేసి వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. జిల్లా రెడ్ క్రాస్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సమావేశాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థాపించించిన ఏడాదిలోనే మంచి కార్యక్రమాలు నిర్వహించారని అభినందించారు. రెడ్ క్రాస్ భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని, భవన నిర్మాణానికి నిధులు సేకరించాలని సూచించారు. వైద్య శిబిరాలు నిర్వహించేందు జిల్లా యంత్రాంగం నుండి రూ.3లక్షలు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నుండి లక్ష రూపాయల సమకూర్చుతామని చెప్పారు. రెడ్ క్రాస్ చైర్మన్ డా.ఎం.శ్రీరాములు మాట్లాడుతూ 13 నెలల కాలంలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించామని, 10మంది వివిధ అధ్యాపక వైద్యులు తమ సేవలను అందించారని తెలిపారు. రూ.60వేలు విలువైన మందులను ఉచితంగా అందజేశామన్నారు. నిరుపేదలకు హైజీనిక్ కిట్లను, గిరిజనులకు 150 జతల కొత్త బట్టలు పంపిణీ చేశామని వివరించారు. వివిధ శిబిరాల్లో రక్త యూనిట్లను సేకరించి గర్భిణులు, డయాలసిస్ పేషెంట్లు, టైఫాయిడ్, మలేరియా రోగులు, యాక్సిడెంట్ పేషెంట్లు తదితరులకు అందించామని చెప్పారు. పేదలకు 4430 ఉచిత పౌష్టికాహార భోజన ప్యాకెట్లను పంపిణీ చేశామని తెలిపారు. సభ్యత్వ రుసుంగా రూ.1,38,600 సేకరించామని, జగదీశ్వరరావు 42 మంది సభ్యులను చేర్పించారని, బోటు రామకష్ణ 38 మంది సభ్యులను చేర్పించారని చెప్పారు. ఈ సందర్భంగా బి.జయబాబు, బి. నాగభూషణరావు భవన నిర్మాణానికి రూ.లక్ష చొప్పున విరాళంగా అందిస్తామని ప్రకటించారు. ఉత్తమ సేవలు అందించిన వైద్యులు డి.రవీంద్రరావు, వై.వివేక్, ఎన్.దుర్గాప్రసాద్, స్వరూప్, వై.ధీరజ్, కె.శ్రీరేఖ, కె.రాజీవ్, వై.రజనీ ప్రియ, ఎం. సుబ్రమణ్యం, జి.ప్రభాకర్ రావు, 96 సార్లు రక్త దానం చేయడమే కాకుండా 2,500 మందిని రక్త దానం కోసం ప్రేరేపించడం, ఎక్కువ మందిని సభ్యులుగా నమోదు చేసిన బోటు రామకష్ణ, సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొన్నా తాడి రమేష్ తదితరులను సత్కరించారు. రెడ్ క్రాస్‌కు మంచి ప్రోత్సాహమిస్తున్న జిల్లా కలెక్టర్‌ను సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాధ రావు, సభ్యులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్



రోటరీ సభ్యులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కొండలరావు పలువురు అభినందనలు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురానికి చెందిన పైడా కొండలరావు కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. రెడ్ క్రాస్ సంస్థలో చేరిన నాటి నుంచి నేటి వరకు ప్రజలకు మంచి సేవలందించారని కొనియాడారు. ఇందుకు గాను సేవలను గుర్తించిన జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సంస్థ ప్రెసిడెంట్ నిశాంత్ కుమార్ బెస్టు ఆర్గనైజర్ గా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గుమ్మలక్ష్మీపురం ప్రజలు కొండలరావును అభినందించారు.


సుభాష్‌చంద్రబోస్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న సంజీవనాయుడు

ఘనంగా సుభాష్ చంద్రబోస్ వర్ధంతి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో శుక్రవారం సుభాష్ చంద్ర బోస్ వర్ధంతి వేడుకలు నేతాజీ గ్రంథాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట యోధుల ప్రాణ త్యాగ కర్త సుభాష్‌చంద్రబోస్ అని అన్నారు. స్వాతంత్ర్యం తెచ్చిన వ్యక్తుల్లో చంద్రబోస్ ప్రాముఖ్యం గల వ్యక్తిని, ఆయన ఆశయ సాధనకు యువత, ప్రజలు రుణపడి ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ యువత నల్ల నవీన్, లైన్‌మెన్ గంట సింహాచలం, వాసు, చేడికి శంకరరావు, మర్రాపు వెంకటేష్, వృక్షప్రేమికుడు దయానంద్, జగన్నాథం, సతీష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంఇఒల సంఘం అధ్యక్షులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మండల విద్యాశాఖ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు సామల సింహాచలం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను సామల సింహాచలం దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం సామల విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు, కెజిబివి విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. జిల్లాలో విద్యాభివృద్ధికి ఎంఇఒలంతా కలెక్టర్ ఆదేశాలను పాటిస్తూ కృషి చేస్తామని సామల తెలిపారు.


ఎపిటి కిట్లు సిబ్బందికి అందజేస్తున్న వైద్యాధికారి ప్రభాకరరావు

సొంత నిధులతో మలేరియా పరీక్ష పరికరం కొనుగోలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ పిహెచ్‌సి పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు మలేరియా పరీక్షల కిట్లును సీనియర్ వైద్యులు గుడివాడ ప్రభాకరరావు శుక్రవారం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం మలేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఒక్కొక్క ఆరోగ్య కార్యకర్తకు 7 ఎపిటి కిట్లు చొప్పున అందజేశారు. అయితే ఈ కిట్లు ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో గత కొన్నేళ్లు నుంచి వైద్యులు ప్రభాకర్ తన సొంత నిధులతో కిట్లు కొనుగోలు చేసి అందించడం విశేషం. ప్రభాకరరావు సేవలకు ఏజెన్సీ ప్రజలు అభినందిస్తున్నారు.


సమావేశంలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

సకాలంలో పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల్లో నిర్మాణాలు జరుగుతున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల పనులు సకాలంలో పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన పనులన్నీ ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులకు నిధులు కొరత లేదని, కాంట్రాక్టర్లు పనులు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పనులపై ప్రత్యేక బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్‌ఇ ఎంవిఆర్ కృష్ణాజీ, డిఇ రత్నాకర్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ హనుమంతరావు, చంద్రమౌళి, ప్రవీణ్ కుమార్, ఇఒపిఆర్‌ఇ కెకె వర్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిపి బి.రమణమ్మ, 21 సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పులి సంచారంపై గ్రామాల్లో ప్రచారం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని కొరమ గ్రామ క్వారీ పరిసర ప్రాంతంలో పులి అడుగుజాడలు ఉన్నట్టు నిర్ధారణ కావడంతో అటవీశాఖ అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పులి తారసపడితే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను ఫారెస్ట్ బీట్ అధికారి లక్ష్మణమూర్తి పెద్దిదిమిలి, ఘనసర, బాలేరు, నల్లారాయిగూడ, లివిరి, బొడ్డగూడ సచివాలయాలకు అందజేశారు. ఈ కరపత్రంలో సూచించిన అంశాలు సచివాలయ పరిధిలో ప్రజలకు అవగాహన కలిగించాలని, పశువుల కాపర్లు, పొలం పనికి వెళ్లేవారు, కొండపోడు వ్యవసాయ చేసేవారు, రాత్రి వేళ సంచరించేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని ఫారెస్ట్ బీట్ అధికారి తెలిపారు.

దిశ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

దిశాయాప్‌పై హెచ్‌సి లావణ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు పట్టణంలోని సురేష్ స్కూల్, వేదాంత కాలేజీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు, పాతబస్టాండ్, ఆర్‌టిసి కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం దిశాయాప్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, మహిళలకు పిల్లల ప్రవర్తన తదితర అంశాలపై అవగాహన ఏర్పర్చుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని మహిళలపై జరుగుతున్నా నేరాలు దృష్ట్యా వాటిని అరికట్టడానికి వాడే సెల్ ఫోన్లలో దిశా యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని అన్నారు. ఈ యాప్ ఒక వజ్రాయుధం లాంటిదని, వాటివల్ల కలిగే ప్రయోజనాలు వివరించి, అందరి మొబైల్ ఫోన్లలో దిశా యాప్ డౌన్ లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో దిశా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కురుపాం

విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియ కళాశాలలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీలో అంతరాయాలు, బిల్లింగ్, కొత్త, పాత సర్వీసుల పునరుద్ధరణ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని, ఇంకా విద్యుత్‌పరంగా ఏమైనా సమస్యలుంటే వాటిని కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఇఇ వివి కిశోర్, డిఇఇ ఎం.రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ ఎ.ఉషారాణి, అధ్యాపకులు, విద్యుత్ సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ

పరిష్కార వేదిక దొరికేనా?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇప్పటి వరకు నిర్వహించిన సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించిన సమస్యలకు పరిష్కార మార్గం చూపించలేదు. మండలంలోని పలు సమస్యలను ఎంపిటిసి సభ్యులు సభా వేదిక దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారానికి నోచుకోలేదు. ప్రస్తావించిన సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇస్తున్న అధికారులు కనీసం స్పందించడం లేదు. దీంతో సమావేశాలు పెట్టి కాలయాపన చేయడమే తప్ప మరొకటి లేదని చెముడు గూడ, ఇరిడి ఎంపిటిసిలు మండంగి రమణ, దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్ అన్నారు. ఈ నేపథ్యంలోనే మరోసారి నేడు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలోనైనా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారో, లేదో చూడాల్సిందే.

గత సమావేశంలో ప్రస్తావించినవి

- దుమ్మంగిలో పాఠశాల ఏర్పాటు చేయాలని, ఇరిడి, తోలు ఖర్జ, మల్లుగూడలో పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలి
- గిరిజనులు పండించే జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, గిరిజన సహకార సంస్థ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని, నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలని, క్రిమిసంహారక మందులు అందించాలి.
- టెంకసింగి, గుణద, బాసంగి, దుమ్మంగి గ్రామాల్లో సిసి రోడ్లు మంజూరు చేయాలి.
-దుమ్మంగి గ్రామ సమీపంలో మంజూరైన జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి.
- గిరిజన గ్రామాల్లో తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించాలి.
- గతంలో నిర్మించిన చెక్ డ్యాములు, మినీ రిజర్వాయర్ వంటి సాగునీటి వనరులను అభివృద్ధి పర్చి పంట పొలాలకు సాగునీరందించాలని ఇలా ఎన్నో సమస్యలను ప్రస్తావించిన నేటికీ పరిష్కరించలేదు.

నేడు మండల సర్వసభ్య సమావేశం


దుమ్మంగిలో పాఠశాల లేక వేరే గ్రామానికి బస్సులో వెళ్తున్న చిన్నారులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాల్మన్‌రాజు తెలిపారు. ఎంపిపి కె.దీనమయ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, మండల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

సాగునీటి కోసం తీవ్ర అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామానికి తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ మొదటి బ్రాంచ్ నుంచి సాగునీరు వచ్చేందుకు నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మండలంలోని గడగమ్మకు చెందిన రఘుమండల తాత బాబు, వెంకటరమణ, సూరపునాయుడు, మజ్జి పైడిపునాయుడు, గొల్ల బాబు, జి.సత్యంనాయుడు, రామినాయుడు, జి.జోగినాయుడు, ఎం.నాగభూషణం, తదితర రైతులు శుక్రవారం విలేకరు వద్ద వాపోయారు. శివారు ప్రాంతాల భూములకు సాగునీరు సరఫరా చేస్తామని, గత నెల 20న సాగునీరు విడిచి పెట్టినప్పుడు అధికారులు హామీ ఇచ్చారని, నేటికి నెలరోజులు కావస్తున్నా తమ గ్రామాలకు సాగునీరందలేదన్నారు. దీంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

హెచ్‌ఎంలకు పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నాడు - నేడు రెండో విడత పనుల్లో ప్రధానోపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించాలని ఎపి ఎస్సీ ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి దేవానంద్ విజ్ఞప్తి చేశారు. నాడు నేడు ద్వారా పాఠశాలల్లో వివిధ నిర్మాణాల పనులు జరుగుతున్నాయని, వీటికి సంబంధించిన అంచనాలు, డబ్బులు ఖర్చు పెట్టే విషయంలో ఇంజినీరింగ్ సిబ్బంది సహకారం కూడా చాలా అవసరమని అన్నారు. విద్యా బోధన సంబంధిత కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు విధులు నిర్వహించాల్సి ఉందని, కాబట్టి వారిని పర్య వేక్షణకు మాత్రమే పరిమితం చేయాలని, పని భారాన్ని తగ్గించాలని ఆయన కోరారు.

విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పిల్లలు విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను పునికి పుచ్చుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పట్టణంలోని బెలగాంలో గల శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జయహో భారత్ - ఇన్వెస్టర్ శిరోమణి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మొదటి తరగతి నుంచే నాయకత్వ లక్షణాలను వెలికి తీసి వారిలో ఉత్తమ గుణాలను ప్రోత్సహించి ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకే ఈ కార్యక్రమమన్నారు. అందులో భాగంగా ప్రతి తరగతి నుంచి ఉత్తమ నాయకత్వ లక్షణాలను కనపర్చిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి క్లాస్ లీడర్స్‌గా బాధ్యతలను అప్పజెప్పి వారిలో మరింత నాయకత్వ పటిమను పెంపొందించేలా కృషి చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయకత్వ ప్రతిభ, సమస్యను పరిష్కరించుకునే సామర్థ్యం, మానసిక ధృఢత్వం తదితర లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ ప్రతిభ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, మెడల్స్ అందించడం జరిగినది. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పాఠశాల రీజనల్ ఇంచార్జీ వి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ బి.జగదీష్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆశాల నిరసన

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

తమచే సంబంధం లేని పనులు చేయించరాదని, నాణ్యమైన సెల్ ఫోన్లు, 4-జి సిమ్ కార్డులు ఇవ్వాలని, ఆన్లైన్ శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని కోరుతూ స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ పాలకొండ అర్బన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం వైద్యాధికారికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ పట్టణంలో 9 సచివాలయాల పరిధిలో ఐదుగురు ఎఎన్‌ఎంలు మాత్రమే ఉన్నారని, నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పట్టణ జనాభాకు అనుగుణంగా ఆశా వర్కర్ల సంఖ్య లేదని, దీనివల్ల ఆశా వర్కర్లపై పని భారం పెరుగుతుందని, సంబంధం లేని ఆన్లైన్ వర్కర్లకు అన్ని స్వంత ఫోన్ ద్వారానైనా చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, సెలవులు లేకపోవడంతో అనారోగ్యాల పాలవుతున్నారని, ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించడం, వ్యాక్సిన్ బాక్సులు తీసుకురావడం, ఆన్లైన్ వర్క్స్ భారాన్ని తగ్గించాలని, ఆన్లైన్లో లేదా రికార్డు ఒక పని ఒకసారి మాత్రమే చేసేలా చూడాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ పరిధిలో ఉన్న సమస్యలన్నీ తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కె.గౌరీశ్వరి, కె.గౌతమి, శ్రీదేవి, కాంతామణి, లక్ష్మి, పార్వతి, రాధా, రాణి, కన్య, అనురాధ, ధనలక్ష్మి, రూపావతి, శారద, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

పంచాయతీల అభివృద్ధికి నిధులు వినియోగం

ప్రజాశక్తి - భామిని

ప్రాధాన్యత క్రమంలో మండలి పరిషత్ గ్రాంట్లు పంచాయతీ అభివృద్ధి పనులకు కేటాయించామని, మిగిలిన పంచాయతీలకు కూడా అభివృద్ధి పనులకు దశలు వారీగా గ్రాంట్లు కేటాయిస్తామని ఎంపిపి తోట శాంతికుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సుమారు 12 గంటలకు ప్రారంభమైన సమావేశంలో మండలంలో కొన్ని శాఖల అధికారులు, ఎక్కువ మంది ఎంపిటిసి సభ్యులు గైర్హాజరయ్యారు. ఈ అంశంపై మండలి ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం సమాధానమిస్తూ, పూర్తి స్థాయిలో వ్యవసాయ పనులు, వ్యక్తిగత పనులు దృష్ట్యా ఎంపిటిసిలు హాజరు కాలేదని, మండలంలోని పలు శాఖల అధికారులు నీతి అయోగ్ శిక్షణలో భాగంగా హైదరాబాద్ వెళ్లారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ సహాయకులు ఎలీసా మాట్లాడుతూ ఆర్‌బికెల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి ఆర్‌బికెల్లో యూరియా, వరి విత్తనాలు అందుబాటులో ఉండాలని ప్రత్యేక ఆహ్వానితులు సూచించారు. పూర్తి స్థాయిలో ఈ క్రాప్ చేసి రైతులు నష్టపోకుండా చూడాలని బాలేరు ఎంపిటిసి సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్ తెలిపారు. వ్యవసాయ పనిముట్లు, టార్పాలిన్లు, స్ప్రేలు సెప్టెంబర్ నాటికి ఆర్‌బికెల్లో అందుబాటులో వస్తాయని వ్యవసాయ సహాయకులు తెలిపారు. వైద్యాధికారి దీపికారాణి మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నామని, దోమలు ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. డెంగీ కేసులకు జాగ్రత్తలు తీసుకుంటూన్నామని, కొండ ప్రాంతంలో ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో మూడు పిహెచ్‌సిలకు అదనపు భవనాలు మంజూరయ్యాయని, ఒక్కొక్క అదనపు భవనానికి రూ.9లక్షలు, ల్యాబ్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరుయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తోట సింహాచలం తెలిపారు. ఎంఇఒ భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో జె వి కె కిట్లు పంపిణీ చేశామన్నారు. సమావేశానికి ఎక్కువ మంది ఎంపిటిసి సభ్యులు గైర్హాజరవ్వడంపై వ్యక్తి గత కారణాలా? రాజకీయ కారణాల అన్న అంశంపై చర్చ జరుగుతుంది. సమావేశంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి ప్రసాదరావు, ఇఒపిఆర్‌డి కె.కృష్ణారావు, ఎంపిటిసి పాలక ఉషారాణి, సర్పంచ్ ఘరానా శ్రీను, ఐసిడిఎస్ సూపర్ వైజర్ జ్యోతి లక్ష్మీ హాజరయ్యారు.

మండల సమావేశంలో ఎంపిపి


శిథిలావస్థలో పాఠశాల భవనాలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గుమడ, కె.గుమడ మండల పరిషత్ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఈ పాఠశాల ఎప్పుడు కూలి పోతుందోనన్న భయంతో విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని చదువుకొంటున్నారు. ఈ పాఠశాల పరిస్థితిపై తల్లిదండ్రులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అవేదన వ్యక్తం చేస్తున్నారు. గుమడ పాఠశాల భవనం బాగోలేకపోవడంతో దోనుబాయిలో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నాడు-నేడు అని ఎంతో గొప్పలు చెప్పుకుంటున్న తరుణంలో గిరిజన ప్రాంతంలో ఇలాంటి పరిస్థితులు ఎన్నో.

కె.గుమడ పాఠశాలను జనసేన పరిశీలన

కె.గుమడలో శిథిలావస్థలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జనసేన మండల నాయకులు మండంగి విశ్వనాథం శుక్రవారం పరిశీలించారు. ఈ పాఠశాల పరిస్థితిపై విద్యార్థుల తల్లిదండ్రులు అనేకమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనీ అవేదన వ్యక్తం చేశారు. పాఠశాల పరిస్థితి ఇలాగే ఉంటే విద్యార్థులు డ్రాపౌట్స్ అయ్యే ప్రమాదం ఉందని, కావున అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శ్లాబ్ పెచ్చులూడిపోయిన గుమడ పాఠశాల

త్వరితగతిన సచివాలయాల నిర్మాణాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో ప్రస్తుతం నిర్మిస్తున్న సచివాలయాల భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మండల ఇంజనీరింగ్ అధికారి మొహమ్మద్ ఫరూక్ సైపుద్దీన్ అన్నారు. మండలంలోని రావుపల్లిలో నిర్మిస్తున్న సచివాలయ భవన నిర్మాణ పనులను శుక్రవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్ నెల్లి ఈశ్వరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇ మహమ్మద్ ఫరూక్ సైపుద్దీన్ మాట్లాడుతూ రావుపల్లిలో చేపడుతున్న స్లాబ్ నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే పెద్దూరులో రైతు భరోసా కేంద్రం పనులు దాదాపుపూర్తి కావచ్చాయన్నారు. గ్రామంలో ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని పేర్కొన్నారు. సంతోషపురంలో ఆర్‌బికె, సచివాలయ భవనంతో పాటు ఆరోగ్య కేంద్ర భవన పనులు పూర్తయ్యాయన్నారు. అలాగే చిన్నగొడవలో సచివాలయ భవనం త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

తాళ్లబురిడిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

మండలంలోని తాళ్లబురిడిలో డోకిశీల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఐశ్వర్య ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో 49 మందికి ఒపిలు నిర్వహించి వైద్య సేవలందించామన్నారు. గ్రామంలో ప్రతినెలా రెండుసార్లు క్రమం తప్పకుండా వైద్య సేవలందిస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించి మలేరియా, డెంగీ రక్త పరీక్షలు నిర్వహించామని తెలిపారు.

పక్కాగా గ్రామ సంఘాల పుస్తక నిర్వహణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గ్రామ సంఘాల పుస్తక నిర్వహణ పక్కగా జరగాలని వెలుగు ఎపిఎం పువ్వల సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో విఒఎలకు ఆర్థిక సుస్థిరత అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల, గ్రామ సంఘాలు స్వతహాగా నిధులు సమకూర్చుకొని వ్యాపారాలు చేసుకొని ఆదాయం వచ్చే కార్యక్రమాలు చేయాలని, అందుకు తగ్గ ఏర్పాట్లు విఒఎలు గ్రామ సంఘం సమావేశంలో చర్చించాలన్నారు.

కలుపు నివారణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పాచిపెంట

పంటలో కలుపును నివారిస్తే అధిక దిగుబడు సాధించవచ్చునని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లిలో వరి పంట పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కలుపు విషయంలో జాగ్రత్తలు పాటించాలని, ముందుగా పొలాన్ని దున్ని తొలకరి, మొదటి వర్షాలకు పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని 40 రోజుల్లో కలియ దున్ని పది రోజుల తర్వాత పంటదమ్ము చేసుకుంటే కలుపును 70 శాతం వరకు నివారించుకోవచ్చని పంటకాలం మొదటి 30 రోజులు కలుపు లేకుండా చూసుకోవడం అత్యంత ప్రాముఖ్యమైన అంశమని తెలిపారు. రైతులు కలుపు నివారణకు నేరుగా రసాయనాలు వాడకుండా వేసవి దుక్కులు, పచ్చిరొట్ట విత్తనాలు దమ్ముకి, పంటదమ్ముకి మధ్యలో వేసుకోవాలన్నారు. ప్రెటిలా క్లోర్ ఆల్ మిక్స్ లేదా సాతి లాంటి మందులను పొడి ఇసుకలో కలిపి భూమిలో తేమ ఉన్నప్పుడు మాత్రమే వరి పంట నాటిన రెండు మూడు రోజుల లోపు మాత్రమే వేసుకోవాలని తెలిపారు.

మొక్కల సాంద్రత- పొటాష్ ఎరువు

ఖరీఫ్ సీజన్లో ఒక చదరపు మీటరుకు కనీసం 33 కుదుర్లు ఉండేలా నాటుకుని దమ్ములో కచ్చితంగా 17 కిలోల పొటాష్, 50 కిలోల యూరియా తప్పనిసరిగా వేసుకుంటే దిగుబడులు రెండు నుండి మూడు బస్తాలు పెరగడమే కాకుండా పొటాష్ ఎరువు పంటను చీడపీడల నుండి రక్షిస్తుంది. కావున రైతులంతా తప్పనిసరిగా పొటాష్ ఎరువు వాడుకోవాలని కోరారు. తేలికపాటి నాట్లు వేసుకోవాలని, రెండు, మూడు మొనలను మాత్రమే ఒక కుదురుకు ఉండేలా చూసుకోవాలని, నారు చివర్లు తుంచి నారు శుద్ధి చేశాక నాటుకోవాలని విఎఎ నాగమణి తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

సీజనల్ రోగాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహన రావు అన్నారు. శుక్రవారం ఆయన తాళ్లబురిడి, పుట్టూరు, పెదబొండల్లిని ఆకస్మికంగా సందర్శించారు. తాళ్లబురిడిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనారోగ్య లక్షణాలతో వచ్చిన వారికి నిర్వహించిన పరీక్షలు, అందజేసిన మందుల వివరాల రికార్డులను పరిశీలించారు. గ్రామంలో జ్వర లక్షణాలతో ఎంతమంది ఉన్నారు, ఎంత మందికి మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు అన్న అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఎప్పటికప్పుడు సర్వే చేసి జ్వరాలతో ఉన్న వారిని గుర్తించి, ప్రాథమిక దశలోనే వైద్యం అందజేస్తే తీవ్రత లేకుండా జాగ్రత్త పడవచ్చున్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు ఆయన అక్కడ డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కోరారు. అలాగే పుట్టూరులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం వద్ద 104 వాహనంలో వైద్య పరికరాలు, మందులు తనిఖీ చేసి ప్రజలకు వీటిని ఆయా సందర్భాల్లో వినియోగించాలన్నారు. అనంతరం పెదబొండపల్లి పిహెచ్‌సిలో వైద్య సిబ్బందితో డాక్టర్ జగన్మోహనరావు సమీక్ష నిర్వహించి పలు ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి నివేదికలను పరిశీలించి పురోగతి సాధించాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యాధికారులు డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ అనూష, డాక్టర్ ధరణి, ఎఎంఒ సూర్యనారాయణ, సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


తాళ్లబురిడిలో రోడ్డుపై ఉన మురికినీటి పరిశీలిస్తున్న డిఐఒ

వన్యప్రాణుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి -బెలగాం

జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులు, పులి నుండి ప్రజలను రక్షించాలని జనసేన నాయకులు కోరారు. శుక్రవారం ఆ పార్టీ జిల్లా నాయకులు వంగల దాలినాయుడు, అన్నాభత్తుల దుర్గాప్రసాద్, కర్రి మణి, అంబటి బలరాం తదితరులు విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే గత నాలుగేళ్లుగా జిల్లాలో 11 మంది రైతులను, సామాన్యులను ఏనుగులు పొట్టన పెట్టుకొని, సుమారు మూడు కోట్ల రూపాయల పంటలను, ఆస్తులను ధ్వంసం చేస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. ఇప్పుడు పులి సంచరిస్తున్నట్లు తెలియడంతో ప్రజలు మరింత భయాందోళనకు గురవుతున్నారన్నారు. జిల్లాలో సీతంపేట, భామిని, సాలూరు, గరుగుబిల్లి మండలాల్లో పులి సంచరిస్తున్నట్లు అడుగుజాడలు కనిపించడంతో ప్రజలు భీతిల్లుతున్నారన్నారు. ఏనుగుల బాధలకు తోడు, పులి భయం తోడైందని, వీటిపై తక్షణమే పాలకులు అధికారులు కళ్లు తెరచి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఏనుగులు, పులులు మరికొంతమందిని పట్టణ పెట్టుకోక ముందే కార్యాచరణ రూపొందించాలన్నారు.

ధర్మ పోరాటానికి సిద్ధం కండి

ప్రజాశక్తి - సీతంపేట

ధర్మ పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని టిడిపి నాయకులు పడాల భూదేవి పిలుపు నిచ్చారు. శుక్రవారం గాటి గుమడలో పర్యటించారు. ఈ సందర్భంగా భవిష్యత్తుకు గ్యారెంటీపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైసిపి ప్రభుత్వంలో అధర్మ పాలన సాగుతోందని, రానున్న సమరంలో ధర్మపోరాటం చేయాలని కోరారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు పడాల భూదేవి

నేరాలు ఘోరాలు

ప్రాణం తీసిన క్షణికావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఇంట్లో ఏర్పడిన చిన్న ఘర్షణతో క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొమరాడ మండలం దళాయిపేటలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న ఎస్.వెంకటి (35) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. భార్యా భర్తల మధ్య జరిగిన స్వల్ప ఘర్షణతో వెంకటి మనస్థాపం చెంది పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పది లీటర్ల నాటుసారా పట్టివేత

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కీసరజోడు సమీపాన ద్విచక్ర వాహనంపై పది లీటర్లు నాటు సారా తరలిస్తుండగా ఎస్సై ఎ.నీలకంఠరావు మాటువేసి పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు. అయితే నాటుసారా స్వాధీనం చేసే వ్యక్తి పరారయ్యాడు.